
# మనం
## కరీంనగర్
జగిత్యాల- రాజన్న సిరిసిల్ల- పెద్దపల్లి -మంచిర్యాల- కొమురంభీమ్

శనివారం | 30 | సెప్టెంబర్ | 2023 | పేజీలు : 8


ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు

## నాణ్యమైన విద్యబోధన అందించాలి

- ప్రతినెల 3వ శనివారం పేరెంట్స్ టీచర్ మీటింగ్ నిర్వహించాలి
- తరగతి గదులలో ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలి
- ప్రాధాన్యత క్రమంలో టాయిలెట్ల నిర్మాణం పూర్తిచేయాలి
- విద్యాబోధనపై విద్యాశాఖ అధికారులతో సమావేశం
- జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్

2 లో






సంఘాల్లో చీలిక..
పోటీకి విముఖత ..?

న్యాయ పోరాటానికి సై అంటున్న సంఘాలు..!

# సింగరేణి సంఘాల్లో రచ్చ రేపుతున్న
# గుర్తింపు సంఘ ఎన్నికలు

మంచిర్యాల, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): సింగరేణిలో గుర్తింపు సంఘ ఎన్నికల అంశం సింగరేణిలో ఉన్న 14 గుర్తింపు సంఘాల్లో చిచ్చు పెట్టడమే కాకుండా, ఎన్నికలు జరగక మందే చీలిక తెచ్చింది. 2019 అక్టోబర్ తోనే గుర్తింపు సంఘం కాల పరిమితి ముగిసింది. ఎన్నికలను జరుపకుండా నాలుగేళ్లుగా వాయిదావేస్తున్నారని ఎఐటియుసి హైకోర్టులో పోరాటం సాగించింది. చివరకు అక్టోబర్ లో ఎన్నికలలు నిర్వహించాలని న్యాయస్థానం ఆదేశించింది. దాంతో రిటర్నింగ్ ఆఫీసర్, డిప్యూటీ ఆర్ఎల్‌సి డి.శ్రీనివాసులు సింగరేణిలో గుర్తింపు సంఘ ఎన్నికలకు హైదరాబాద్‌లో గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఎన్నికల జరిగే తేదీలతో విడుదల చేసిన షెడ్యూల్ పట్ల ఎఐటియుసి, బిఎంఎస్‌లు మినహా మిగిలిన సంఘాలు విముఖతను చూపుతున్నాయి. మెజారిటీ సంఘాలు సింగరేణిలో గుర్తింపు సంఘం ఎన్నికలను అసెంబ్లీ ఎన్నికల వరకు వాయిదా వేయాలని కోరినా ఏకపక్షంగా కేవలం రెండు సంఘాలతోనే ఎలా షెడ్యూల్ ప్రకటిస్తారని ఆగ్రహం వ్యక్తం చేస్తూ, షెడ్యూల్ పై కోర్ట్ ల ద్వారా న్యాయ పోరాటానికి సై అంటున్నట్లు తెలుస్తోంది. సింగరేణి యాజమాన్యం కూడా సుప్రీమ్ కోర్టు మెట్లు ఎక్కడానికి సిద్ధమవుతూ కారణగా ఆర్ఎల్‌సి మీటింగుకు రెండు సంఘాలే వెళ్లాయని, 12 సంఘాలు ఎన్నికలను వ్యతిరేకిస్తున్నాయని వివరించనున్నట్లు సమాచారం. అంతే కాదు ఇంతకుముందు చెప్పినట్లే అక్టోబర్ నెలలో ఎన్నికలు నిర్వహించలేమని బొగ్గగనులు ఉన్న మిగతా 2లో..

## ప్రసవాల పెంపును ఛాలెంజ్‌గా తీసుకోవాలి

- సీజనల్ వ్యాధులు ప్రబలకుండా డ్రై డే కార్యక్రమం పకడ్బందీ చేపట్టాలి
- కలెక్టర్ అనురాగ్ జయంతి

6 లో



# ప్రతి మహిళకు బతుకమ్మ చీర అందేలా చర్యలు

### కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)ః బతుకమ్మ పండుగను పురస్కరించుకొని ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలను జిల్లాలోని అర్హత గల ప్రతి మహిళకు అందేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి బి. శేషాద్రి, మంచిర్యాల, బెల్లంపల్లి రాజస్వ మండల అధికారులు రాములు, సురేష్‌తో కలిసి తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సంవత్సరం ప్రభుత్వం అందించే బతుకమ్మ చీరలను జిల్లాలోని ప్రతి మహిళకు అందేలా సంబంధిత అధికారులు సమన్వయంతో చర్యలు తీసుకోవాలని తెలిపారు. అక్టోబర్ 4వ తేదీ వరకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించాలని, చీరలు తహసీల్దార్ కార్యాలయానికి చేరుకున్న తరువాత చౌకధరల దుకాణాలకు పంపించడం జరుగుతుందని, మహిళలకు చీరలు పంపిణీ చేసి వివరాలు నమోదు చేసుకోవాలని, ప్రతి రోజు మధ్యాహ్నం 2 గంల నుండి 4 గంల వరకు పంపిణీ వివరాల నివేదిక అందించాలని తెలిపారు. జిల్లాలోని 16 మండలాలు, 7 మున్సిపాలిటీలలో 2 లక్షల 84 వేల 940 మంది మహిళలు ఉండగా ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చౌకధరల దుకాణాల ద్వారా పంపిణీకి చర్యలు చేపట్టాలని, ఇప్పటి వరకు 2 3 లక్షల



14 వేల చీరలు వచ్చాయని, మిగతావి 3 రోజులలో అందించడం జరుగుతుందని, చీరల నిల్వ, పంపిణీ వివరాలలో ఎలాంటి విబేధాలు లేకుండా ప్రక్రియ పూర్తి చేసేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. ఈ క్రమంలో చౌకధరల దుకాణాల డీలర్లకు తగు సూచనలు చేయాలని, తప్పనిసరిగా రిజిస్టర్ నిర్వహించాలని, ప్రతి రోజు నివేదిక అందించేలా ఆదేశాలు జారీ చేయాలని తెలిపారు.

## కాంగ్రెస్‌కు ప్రజాదరణ చూసి..

# బిఆర్ఎస్‌లో గుబులు మొదలైంది

### మండల కాంగ్రెస్ అధ్యక్షులు రమణారెడ్డి

తిమ్మాపూర్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)ః రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ పార్టీకి ప్రజల నుంచి వస్తోన్న ఆదరణ చూసి, బిఆర్ఎస్ నేతల్లో గుబులు మొదలైందని మండల కాంగ్రెస్ అధ్యక్షులు మోరపల్లి రమణారెడ్డి వ్యాఖ్యానించారు. మండలంలోని నుస్తులాపూర్ గ్రామంలో ఏర్పాటు చేసిన కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిసిసి అధికార ప్రతినిధి ఎలుకపల్లి సంపత్‌తో కలిసి రమణారెడ్డి మాట్లాడుతూ డిసిసి అధ్యక్షులు కవ్వంపల్లి సత్యనారాయణ సారథ్యంలో మానకొండూరు నియోజకవర్గంలో పల్లె పల్లెకు కవ్వంపల్లి – గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతోందన్నారు. ఇటీవల జరిగిన విజయభేరి బహిరంగ సభకు అశేష జనవాహిని తరలివచ్చి విజయవంతం చేయడం, సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున్ ఖర్గే, టీపీసీసీ అధ్యక్షులు రేవంత్ రెడ్డి సారథ్యంలో ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలకు ప్రజల నుంచి సానుకూలత రావడంతో బిఆర్ఎస్ నేతల్లో ఓటమి భయం పట్టుకుందన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన అనంతరం అన్ని హామీలను అమలు చేసి తీరుతామన్నారు. రాష్ట్రంలో బిఆర్ఎస్ ప్రభుత్వ అధికార దుర్వినియోగంతో రాష్ట్రాన్ని భ్రష్టు పట్టించారని ఆరోపించారు. దళిత బంధు, బీసీ బందు, మైనార్టీ బందు, గృహలక్ష్మి పథకాలను అసలైన అర్హులైన పేదలకు ఇవ్వకుండా పార్టీ జెండా పట్టిన వారికి, వారి అనుచరులకు మాత్రమే పథకాలను వర్తింప చేస్తున్నారని మండిపడ్డారు. రానున్న ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు ఎస్.ఎల్ గౌడ్, జిల్లా కార్యదర్శులు మామిడి అనిల్ కుమార్, సముద్రాల లక్ష్మణ్, కాంగ్రెస్ నాయకులు బుదారపు శ్రీనివాస్, దావు రాంరెడ్డి, కొత్త రాజిరెడ్డి, వరాల అనిల్, తాలపల్లి రమేష్ లతో పాటు గ్రామ శాఖ అధ్యక్షులు, పార్టీ శ్రేణులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.



### తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కమిటీ :

తిమ్మాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ కమిటీ నూతన కార్యవర్గాన్ని నియమించారు. ఈ సందర్భంగా అధ్యక్షులుగా మోరపల్లి రమణారెడ్డి, ఉపాధ్యక్షులుగా తమ్మనవేణి రాములు, బుర్ర కనకయ్య గౌడ్, మెరుగు మోహన్, పొట్ట శ్రీనివాస్, సయ్యద్ అబ్దుల్ రజాక్, ప్రధాన కార్య దర్శులుగా గొట్టేముక్కుల సంపత్ రెడ్డి, గుంటి శ్రీనివా స్, గడ్డం రమేష్, మామిడి నరేందర్ రెడ్డి, కళ్యాణపు లింగమూర్తి, రోడ్డ సాగర్, జంగా రామకృష్ణారెడ్డి, గూడ కమలాకర్, లింగం కుమార్, ఉప్పులేటి రాజు, కోశాధికారిగా బూత్కూరి రాజు, కార్యదర్శులుగా గోదారి రాజమల్లు, ఎలుక శ్రీధర్, జేజేల సంపత్, పుల్లెల స్వామి, రాయినేని రవి, గొల్లె లక్ష్మణ్, ఎడ్ల ఎల్లారెడ్డి, కొట్టే శ్రీనివాస్ రెడ్డి, బుర్ర వంశీ, పాశం రాజిరెడ్డి, జక్కుల కేశవులు, భుడిగే సంపత్, ఆర్గనైజింగ్ సెక్రటరీగా తాళ్లపల్లి శ్రీనివాస్ గౌడ్, ఆరేపల్లి రమేష్, అధికార ప్రతినిధిగా తాళ్లపల్లి కిరణ్, ఆల్వాల కుమార్‌లు నియమితులయ్యారు.

## అక్టోబర్ 1న పెద్దపల్లి, రామగుండంలో మంత్రి కేటీఆర్ పర్యటన

### మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలి

### లబ్దిదారులకు ప్రత్యేక సీటింగ్ ఏర్పాట్లు చేయాలి

### మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లపై అధికారులతో సమావేశం

### జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



పెద్దపల్లి, సెప్టెంబర్ 29(మనం ప్రతినిధి): జిలాలో అక్టోబర్ 1న రాష్ట్ర పరిశ్రమలు, ఐ.టి, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ పర్యటనకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటన సందర్బంగా అదనపు కలెక్టర్‌లు జే.అరుణ శ్రీ, శ్యాంప్రసాద్‌లతో కలిసి జిల్లా అధికారులతో పర్యటన ఏర్పాట్లపై సమీక్షించారు. అక్టోబర్ 1న పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాల పరిధిలో రాష్ట్ర మంత్రి కేటీఆర్ పర్యటించనున్నారని, మంత్రి పర్యటన నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు కట్టుదిట్టంగా చేయాలని కలెక్టర్ సంబంధిత అధికారులకు సూచించారు. పెద్దపల్లి నియోజకవర్గ పరిధిలో మంత్రి పర్యటన పర్యవేక్షణ బాధ్యతలు అదనపు కలెక్టర్ రెవెన్యూ శ్యాంప్రసాద్‌లాల్, రామగుండం నియోజకవర్గ పరిధిలో మంత్రి కేటీఆర్ పర్యటన ఏర్పాట్లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. పెద్దపల్లి, రామగుండం నియోజకవర్గాలలో శంకుస్థాపనలకు ఒక వేదిక ఏర్పాటు చేయాలని, ప్రభుత్వ ఉత్వర్వు సంఖ్య 58,59,76 మొదలగు వివిధ ప్రభుత్వ సంక్షేమ పథకాల లబ్దిదారులకు మంజూరు పత్రాల పంపిణీ కార్యక్రమం ఉంటుందని, లబ్దిదారులకు సీటింగ్ అరేంజ్మెంట్ ప్రత్యేకంగా చేయాలని కలెక్టర్ సూచించారు. మంత్రి పర్యటన నేపథ్యంలో ఎక్కడా ఎలాంటి ఇబ్బందులు రాకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని, జిల్లా అధికారులు, డివిజన్ అధికారులు వారి వారి శాఖల పరిధిలో చేపట్టే పనులు సజావుగా జరిగే విధంగా పర్యవేక్షించాలని కలెక్టర్ తెలిపారు. మంత్రి పర్యటన నేపథ్యంలో పకడ్బందీ బందోబస్తు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. ఈసమావేశంలో పెద్దపల్లి రెవెన్యూ డివిజన్ అధికారి మధుమోహన్, పెద్దపల్లి ఏసీపీ ఎడ్ల మహేష్, కలెక్టర్ ఏఓ శ్రీనివాస్, జిల్లా అధికారులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## ప్రతి పాఠశాలకు నాణ్యమైన సన్న బియ్యం సరఫరా చేయాలి

### అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

పెద్దపల్లి, సెప్టెంబర్ 29(మనం ప్రతినిధి): జిల్లాలోని ప్రతి పాఠశాలకు నాణ్యమైన సన్న బియ్యం మధ్యాహ్న భోజన పథకం కింద సరఫరా చేయాలని అదనపు కలెక్టర్ శ్యాం ప్రసాద్‌లాల్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం మధ్యాహ్న బోజన పథకం అమలుపై సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి పాఠశాలకు నాణ్యతతో కూడిన సన్నబియ్యం సరఫరా అయ్యేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదే శించారు. మండల స్థాయి గోదాముల నుండి నేరుగా పాఠశాలకు సన్నబియ్యం రవాణా చేయుటకు తగిన ఏర్పాట్లు చేసి పర్యవేక్షించాలని జిల్లా అధికారులను ఆదేశించారు. ఈసమావేశంలో జిల్లా విద్యాధికారి డి.మాధవి, పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్, జిల్లా పౌర సరఫరాల అధికారి తోట వెంకటేష్, మండల విద్యాధికారులు, మండల స్థాయి గోదాము అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## సింగరేణి సంఘాల్లో రచ్చ రేపుతున్న

# గుర్తింపు సంఘ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి..

ఆరు జిల్లాల కలెక్టర్‌లు, ఎస్పీలు ఇచ్చిన లేఖలను కోర్టు దృష్టికి తేనున్నట్లు సమాచారం. మరి సుప్రీమ్ కోర్ట్ తీర్పు ఎలా వస్తుందో చూడాలి మరి. ఇక పోటీకి విముఖత చూపుతున్న సంఘాలు మొన్నటి వరకు సింగరేణిలో గుర్తింపు సంఘం జరపాలని, అక్టోబర్ నెలలో ఎన్నికలు పెట్టి తేదీలను ఖరారు చేయాలని భీష్మించి, ఇప్పుడు హఠాత్తుగా యూ టర్న్ తీసుకోవడం వెనుక మతలబు ఏమిటన్నది కోల్ బెల్ట్‌లో చర్చ మొదలైంది. కార్మిక క్షేత్రంలో ఎక్కడ సూచినా ఎన్నికల పైనే గుసగుసలు. చట్ట ప్రకారం చట్ట పరిధిలోనే రిటర్నింగ్ ఆఫీసర్ డిప్యూటీ ఆర్.ఎల్.సి. డి.శ్రీనివాసులు విచక్షణ అధికారాలు ఉపయోగించి షెడ్యుల్ ప్రకటించి ఉండవచ్చని పరిశీలకుల భావన. ఇక ఈ ఎన్నికల షెడ్యుల్ పై పోటీకి ఆసక్తి చూపని మిగతా సంఘాలు న్యాయపరంగా పోరాడాలని డిసైడ్ అయినట్లు విశ్వసనీయ సమాచారం. ఈ నిర్ణయం వెనుక అధికార యూనియన్ సహకారం కూడా ఉండవచ్చని పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణ జాప్యం విషయంపై హైకోర్ట్ నిర్ణయం తోనే స్పష్టత వచ్చింది. కానీ ఎన్నికల షెడ్యుల్ ప్రకటించాక అడ్డం పడటం ఊహించని ట్విస్ట్. ఒకవేళ ఎన్నికలకు నో అంటున్న సంఘాలు కోర్ట్ కు వెళితే ఆర్థిక భారమే, ఎవరు భరిస్తారు అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి ఎన్నికలు జరుగుతాయా.. లేదా.. అనే విషయాన్ని పక్కనబెడితే, కార్మిక సంఘాల్లో చీలికలు, అభిప్రాయ బేధాలతో రచ్చ సాగుతోంది.

## ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నాణ్యమైన విద్యబోధన అందించాలి

పెద్దపల్లి, సెప్టెంబర్ 29(మనం ప్రతినిధి): జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకునాణ్యమైన విద్యా బోధన అందించాలని, మనకు అందుబాటులో ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ వెనుకబడిన ప్రతివిద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని జిల్లా కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ అరుణశ్రీ లతో కలిసి మండల నోడల్, విద్యాశాఖ అధికారులతో విద్యాబోధన, పలు అంశాలపై సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా జిల్లా కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మాట్లాడుతూ మన దగ్గర ఉన్న వనరులను సద్వినియోగం చేసుకుంటూ ప్రైవేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు మెరుగైన విద్యాబోధన అందించాలని కలెక్టర్ అన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, విద్యపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, ప్రతి 3 నెలలకు ఒకసారి ప్రభుత్వ పాఠశాలలో హెల్త్ క్యాంపు నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని కలెక్టర పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మధ్యాహ్న భోజన పథకం అమలుపై కలెక్టర్ వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఎం.ఎల్.ఎస్ పాయింట్ నుంచి స్కూల్ వద్దకు నాణ్యమైన బియ్యం అందించే దిశగా చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకు తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య వంటి కార్యక్రమానలు అములు చేస్తున్నామని, వీటిని జిల్లాలో పకడ్బందీగా అమలు చేస్తూ ప్రతి వెనుకబడిన విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులపై మనం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నట్లు తల్లిదండ్రులకు తెలియాలని, విద్యార్థుల విద్యా ప్రమాణాలు మెరుగుపరిచే అంశంలో తల్లిదండ్రులను భాగస్వామ్యం చేయాలని కలెక్టర్ తెలిపారు.

ప్రభుత్వ పాఠశాలలో ప్రతినెల మూడవ శనివారం పేరెంట్ టీచర్స్ మీటింగ్ నిర్వహించి, ప్రభుత్వ పాఠశాలలో చేపడుతున్న తొలిమెట్టు, ఉన్నతి, లక్ష్య కార్యక్రమాలపై అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా వ్యాప్తంగా టాయిలెట్లు ఇబ్బంది ఉన్న ప్రభుత్వ పాఠశాలల వివరాలు అందించాలని, అత్యంత ప్రాధాన్యంగా టాయిటెట్ల నిర్మాణ పనులు చేపట్టాలని, స్థానిక ప్రజాప్రతినిధులు, కాంట్రాక్టర్లతో సమన్వయం చేసుకుంటూ అందుబాటులో ఉన్న నిధులు వినియోగించి త్వరితగతిన టాయిలెట్లు ఏర్పాటు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు, టీచర్లు హాజరు శాతం నమోదు వివరాలు ప్రతి రోజూ పంపాలని, ప్రతి తరగతికి సంబంధించి సబ్జెక్టుల వారిగా ఉత్తమమైన టీఎల్ఎంలను ఎంపిక చేయాలని, విద్యార్థులకు బోదించే సమయంలో వేగంగా కాకుండా విద్యార్థులకు అర్థమయ్యే విధంగా నాణ్యమైన విద్యను అందించాలని కలెక్టర్ అన్నారు. ఈసమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డా.ప్రమోద్‌కుమార్, అకడమిక్ కో ఆర్డినేటర్ పిఎం షేక్, ఎం ఈఓలు, మండల నోడల్ అధికారులు, ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు,సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# స్వచ్ఛతలో తెలంగాణ దేశానికే రోల్ మోడల్

## పిల్లలందరూ స్వచ్ఛతలో భాగస్వామ్యం కావాలి

### ఎమ్మెల్యే సుంకె రవిశంకర్

చొప్పదండి,సెప్టెంబర్ 29( మనం న్యూస్): స్వచ్ఛతలో తెలంగాణ రాష్ట్రం దేశానికి రోల్ మాడల్ గా నిలిచిందని ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గంగాధర వివేకానంద హైస్కూల్ లో ఆగాఖాన్ స్వచ్ఛ్ మిషన్ ట్రస్మా ఆధ్వ ర్యంలో స్వచ్ఛ్ భారత్ స్వచ్ఛ్ స్కూల్ కార్యక్రమాన్ని రాష్ట్రంలోనే మొదటిసారి వివేకానంద హైస్కూల్ నుండి మొదలుపెట్టారు.దీనికి ముఖ్య అతిథిగా చొప్పదండి ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 20 అవార్డులలో 19 అవార్డులు తెలంగాణ రాష్ట్రానికి దక్కడం గర్వకారణమన్నా రు. మన చుట్టూ ఉన్న పరిసరాలను మన గ్రామాన్ని మన పాఠశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు. స్వచ్ఛ కార్యక్రమం గురించి ప్రైవేట్ స్కూళ్లలో 35 లక్షల మంది విద్యార్థులకు 10వేల స్కూళ్ళలో అవగాహన కల్పిస్తామని తెలిపారు.ఈ కార్యక్రమంలో ట్రస్మా రాష్ట్ర అధ్యక్షులు యాదగిరి శేఖర్ రావు,నియోజకవర్గ అధ్యక్షులు పర్రెం లక్ష్మారెడ్డి, ఆగాఖాన్ రాష్ట్ర కోఆర్డినేటర్ సెల్వరాజ్,జిల్లా స్వచ్ఛభారత్ మిషన్ కోఆర్డినేటర్ రమేష్, వివేకానంద ప్రధానోపాధ్యాయులు అనంత రెడ్డి,సర్పంచ్ల



ఫోరం మండలఅధ్యక్షులు మడ్లపెల్లి గంగాధర్,బి ఆర్ ఎస్ పార్టీ మండల అధ్యక్షులు నవీన్ రావు, సర్పంచ్లు వేముల దామోదర్, వేముల లావణ్య అంజి, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు దోమకొండ మల్లయ్య, నరోత్తం రెడ్డి పానుగంటి సత్యం తదితరులు పాల్గొన్నారు.

## గడప గడపకు కాంగ్రెస్ ప్రచారంలో కవ్వంపల్లి



శంకరపట్నం,సెప్టెంబర్ 29( మనం న్యూస్): పల్లె పల్లెకు కవ్వంపల్లి గడప గడపకు కాంగ్రెస్ కార్యక్రమంలో భాగంగా శంకరపట్నం మండలం కన్నాపూర్, ధర్మారం గ్రామాలల్లో పాదయాత్ర చేసిన కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ బిఆర్ఎస్,బీజేపీ ప్రభుత్వాల వైఫల్యాలు ప్రజలకు తెలియజేస్తు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక అమలు చేసే సంక్షేమ పథకాలు మరియు కాంగ్రెస్ పార్టీ గ్యారంటీల గురించి ప్రజలకు వివరించారు. కన్నాపూర్ మాజీ సర్పంచ్ కాల్వ విజయ ఆధ్వర్యంలో పలువురు కాంగ్రెస్ పార్టీలో చేరారు,ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గోపగోని బసవయ్య గౌడ్ , పీసీసీ సభ్యులు బత్తిని శ్రీనివాస్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ మండల,గ్రామ నాయకులు కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.

## క్షేత్ర పర్యటనలో సెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ విద్యార్థులు



కరీంనగర్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): శుక్రవారం రోజున రేకుర్తి నగరంలోని రేకుర్తి లోసెయింట్ జార్జ్ నినోస్ బ్లాక్ విద్యార్థులు కరీక్యూలమ్లో భాగంగా క్షేత్ర పర్యటనకు)శుక్రవారం రోజున వెళ్ళారు.విద్యార్థులకు పాఠాలను తరగతి గదిలోనే కాకుండా ప్రత్యక్షంగా వివరించడానికి అరేపల్లి కరీంనగర్ కుమ్మరి వారి కుండల తయారీ చేసే విధానం మరియు కుండలను చూపించారు.ఈ కార్యక్రమంలో భాగంగా చైర్మన్ డా.పి.ఫాతిమా రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు నాలుగు గోడల మధ్య బోధన కన్నా ప్రత్యక్షంగా చూస్తూ నేర్చుకున్న వాటిని ఎక్కువగా గుర్తుంచుకోగలరని ఈ క్షేత్ర పర్యటన నిర్వహించడం జరిగిందని ఈ క్షేత్ర పర్యటన నిర్వహించిన ఇన్చార్జ్ సంగీత ను అభినందించారు.

# ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వేదికను ప్రారంభించిన ఎమ్మెల్యే

మంచిర్యాల, సెప్టెంబర్ 29 (మనం న్యూస్ ): మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో ఎనిమిది లక్షల రూపాయల ఎమ్మెల్యే నిధులతో నిర్మించిన ఓపెన్ వేదికను శుక్రవారం ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్ రావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఈ కళాశాల పూర్వ విద్యార్థిగా కళాశాల అభివృద్ధి కి, సౌకర్యాలు తన నిధులతో ఏర్పాటు చేసుకోవడం సంతోషం గా ఉందన్నారు. నూతన ఓపెన్ వేదిక నిర్మాణానికి పూర్వ విద్యార్థుల అసోసియేషన్ నిధులు ఇవ్వడానికి ముందుకు రావడం గొప్ప విషయమని, కానీ ఎమ్మెల్యే నిధులతోనే నిర్మించిన వేదికను ప్రారంభించడం పూర్వ విద్యార్థిగా ఆనందగా ఉందన్నారు. తన సహచర పూర్వ విద్యార్థులు కూడా ఈరోజు కార్యక్రమంలో పాల్గొనడం మరింత ఉత్సాహాన్నిస్తోందన్నారు. అలాగే వేదిక పై కప్పు నిర్మాణం కోసం మరో ఐదు లక్షల నిధులు మంజూరు చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రకటించారు. కళాశాల అభివృద్ధికి తన సహకారం ఉంటుందని తెలిపారు. మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల పూర్వ విద్యార్థుల సంఘం అధ్యక్షుడు కెవి.ప్రతాప్ మాట్లాడుతూ నిధులు మంజూరు చేసిన ఎమ్మెల్యే కు పూర్వ విద్యార్థుల అందరి తరపున ధన్యవాదములు తెలిపారు. అదేవిధంగా ఉమేన్స్ కాలేజీ విద్యార్థులకు హాస్టల్ మంజూరు చేశారని కానీ ఇంత వరకు ఆ హాస్టల్ ను ఇవ్వకపోవడం వల్లమహిళా విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని, ఈ సమస్యను ఎమ్మెల్యే నే పరిష్కరించాలని కోరారు. హాస్టల్ లేక దాదాపు 300 మహిళా విద్యార్థులు కళాశాల చుట్టుపక్కల



ఉంటూ అవస్థలుపడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థుల సంఘం కార్యదర్శి జిపివి.శేఖర్, కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి, పూర్వ విద్యార్థులు నిరంజన్, గోపి, హరీష్,రాజన్న, మొండయ్య, స్థానిక కౌన్సిలర్ తదితరులు పాల్గొన్నారు.

## నిరుపేదల సేవే వెంకగౌడ్ ట్రస్ట్ అభిమతం

### ట్రస్ట్ చెర్మన్ పోడేటి సతీష్ గౌడ్



లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 29(మనం న్యూస్):నిరుపేదలకు సేవ చేయడమే పోడేటి వెంకగౌడ్ ట్రస్ట్ అభిమతమని ఆ ట్రస్ట్ చైర్మన్ పోడేటి సతీష్ గౌడ్ అన్నారు. శుక్రవారం మున్సిపల్ పరిధిలోని 5 వ వార్డ్ లో వివిధ అనారోగ్య సమస్యలతో మరణించిన భానోత్ లింబాజి, చింతకింది రాజవ్వ కుటుంబ సభ్యులకు పోడేటి వెంక గౌడ్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుపేదల కు తమ ట్రస్ట్ ఎల్లవేళలా అండగా ఉంటుందన్నారు. గత కొన్ని ఏళ్లుగా తమ ట్రస్ట్ ద్వారా పలువురిని ఆదుకున్నట్లు వివరించారు. రక్తదానం, వివిధ ఘటనల్లో మరణించిన వారికి అండగా నిలిచి పలు సేవ కార్యక్రమాలు నిర్వహించినట్లు వెల్లడించారు. ఏదైనా సహాయం అవసరమైతే తమ ట్రస్ట్ ను సంప్రదిస్తే పరిశీలించి అర్హులైన వారికి ఆర్థిక, ఇతర సహాయాలు అందిస్తామని తెలిపారు.అనంతరం బాధిత కుటుంబ సభ్యులకు రూ.2000 చొప్పున మొత్తం గా రూ.4000 లను అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పొడేటి శ్రీనివాస్ గౌడ్,మాజీ ఎంపీపీ కట్ల చంద్రయ్య ,మాజీ వార్డ్ సభ్యులు ముత్తె తిరుపతి, గరిసే రవీందర్, కుకట్ల తిరుపతి,చిలుముల నర్సయ్య,మేడారం ఆంజయ్య తదితరులు పాల్గొన్నారు.

## పారిశుద్ధ్య కార్మికులకు ఆరోగ్య శిభిరం




ఇల్లందకుంట మనం న్యూస్: మండలంలోని 18 గ్రామాల లోని గ్రామపంచాయతీలో పని చేస్తున్న కార్మికుల కు శుక్రవారం ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి అధికారి డాక్టర్ తులసీదాస్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమంలో భాగంగా వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ తులసీదాస్ మాట్లాడుతూ కరోనా సమయంలో తమ ప్రాణాలను లెక్కచేయకుండా కార్మికులు ఎంతో సేవ చేశారని వారి సేవలను వెలకట్టలేవని అన్నారు. సీజనల్ వ్యాధులపై కార్మికులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కంకణాల శ్రీలత సురేందర్రెడ్డి, స్వచ్ఛభారత్ మిషన్ కో ఆర్డినేటర్ కిషన్స్వామి, ఎంపీడీఓ శంకర్,ఎంపీఓ వెంకటేశ్వర్లు, ఎల్త్డ్యుకేటర్ మోహన్రెడ్డి, సిహెచ్ఓ శ్యామల, హెడ్ అనిత, ఏఎన్ఎంలు,ఆశాకార్యకర్తలు,వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

## కెటిఆర్ పర్యటనకు అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలి

### ప్రభుత్వ విప్ బాల్క సుమన్



మంచిర్యాల ప్రతినిధి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)ః జిల్లాలోని మంద మర్రి, క్యాతనపల్లి మున్సిపాలిటీల పరిధిలో పలు అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించేందుకు కెటిఆర్ వచ్చే నెల 1వ తేదీన చేయనున్న పర్యటనకు అన్ని శాఖల అధికారులు పూర్తి స్థాయి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని ప్రభుత్వ విప్, చెన్నూర్ నియోజకవర్గ శాసనసభ్యులు బాల్క సుమన్ తెలిపారు. శుక్రవారం జిల్లాలోని మందమర్రి మున్సిపల్ పరిధిలోని హెలిప్యాడ్, ఆయిల్ పామ్ ఫ్యాక్టరీ ప్రాంతాలను కలెక్టర్ బదావత్ సంతోష్, జిల్లా అదనపు కలెక్టర్ బి.రాహుల్, డిసిపి సుధీర్ రామ్నాథ్ కేకన్తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సుమన్ మాట్లాడుతూ కెటిఆర్ తొలిసారిగా జిల్లాలో పర్యటించనున్న సందర్భంగా అన్ని ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. మందమర్రి మున్సిపల్ పరిధిలో రెండు పడక గదుల ఇండ్ల పంపిణీ, సమ్మక్క సారలమ్మ మహిళా భవన్, కె.సి.ఆర్. మల్టీపర్పస్ కమ్యూనిటీ హాల్, బతుకమ్మ మైదానం, అర్బన్ మిషన్ భగీరథ, సెంట్రల్ లైటింగ్ సిస్టం, ఊరు మందమర్రి ట్యాంక్ బండ్, కెసిఆర్ పార్క్ సందర్శిస్తారని, క్యాతనపల్లి మున్సిపల్ పరిధిలో గాంధారి వనం సందర్శించి ఠాగూర్ మైదానంలో సభకు హాజరవుతున్న నేపథ్యంలో అధికారులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పూర్తి ఏర్పాట్లతో సిద్ధంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా శాంతి భద్రతల పరిరక్షణలో పోలీసు శాఖ అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మందమర్రి మున్సిపల్ కమిషనర్ రాజు, మండల పరిషత్ అభివృద్ధి అధికారి శశికళ, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఎంఐఎం బైక్ ర్యాలీలో వికృత చేష్టలు

## బిజెపి, హిందూత్వానికి వ్యతిరేకంగా నినాదాలు

## ఎంపి కార్యాలయంపై దాడికి యత్నం

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): కరీంనగర్‌లో శుక్రవారం మజ్లిస్ పార్టీ కార్యకర్తలు చేపట్టిన బైక్ ర్యాలీ కలకలం సృష్టించింది. ర్యాలీ సందర్భంగా ఆ పార్టీకి చెందిన పలువురు కార్యకర్తలు చేసిన వికృత చేష్టల కారణంగా ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. బైక్ ర్యాలీ బిజెపి జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపి బండి సంజయ్ కార్యాలయం వద్దకు చేరుకోగానే ఎంఐఎం కార్యకర్తలు చేసిన నినాదాలు వివాదాస్పదంగా మారాయి. బండి అంతు చూస్తామని పేర్కొంటూ, బిజెపికి, హిందూత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. విషయం తెలుసుకున్న పలువురు బిజెపి నాయకులు, కార్యకర్తలు అక్కడికి చేరుకోగానే ఎంఐఎం కార్యకర్తలు అక్కడ నుంచి మాయమై, బండి సంజయ్ ఇంటి సమీపంలోకి వెళ్లి తిరిగి వ్యతిరేక నినాదాలు చేశారు. కొద్ది సేపటి తరువాత మళ్లీ ఎంపి కార్యాలయానికి చేరుకుని, ఆఫీసు ముందు ఉన్న బోర్డును తొలగించే ప్రయత్నం చేశారని స్థానికులు తెలిపారు. బిజెపి నాయకులు ఇచ్చిన సమాచారంతో ఎంపి కార్యాలయం వద్దకు చేరుకున్న పోలీసులు బిజెపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్, కార్పొరేటర్ రాపర్తి ప్రసాద్, ఇతర నాయకుల నుంచి వివరాలు సేకరించారు.

**ఉద్దేశ్యపూర్వకంగానే ఎంఐఎం గూండాల దాడి**

**: బిజెపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్‌రావు**

**– సిపికి ఫిర్యాదు**

మజ్లీస్ గూండాలు మత కలహాలు సృష్టించేందుకే ఉద్దేశ్యపూర్వకంగా బండి



సంజయ్ నివాసంపై దాడికి యత్నించారని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ బోయినపల్లి ప్రవీణ్‌రావు వ్యాఖ్యానించారు. దేశద్రోహ నినాదాలు చేస్తూ అసభ్య పదజాలంతో దూషిస్తూ రెచ్చగొట్టేందుకు యత్నించారని పేర్కొన్నారు. మజ్లీస్ కార్యకర్తల తీరును నిరసిస్తూ శుక్రవారం సాయంత్రం సిపి కార్యాలయం ర్యాలీ నిర్వహించి ప్రవీణ్‌రావు, బిజెపి నాయకులతో కలిసి సిపి సుబ్బారాయుడుకు ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్దేశ్యపూర్వకంగా మత కలహాలు సృష్టించే రీతిలో వ్యవహరించిన ఎంఐఎం కార్యకర్తలపై కఠిన చర్యలు తీసుకుంటూ, ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.





## కళ్యాణలక్ష్మి పథకం పేదలకు ఓ వరం



ఇల్లందకుంట మనం న్యూస్: కళ్యాణలక్ష్మి పథకం పేదలకు ఓ వరం లాంటిదని శాసనమండలి సభ్యులు, ప్రభుత్వ విప్, పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని కళ్యాణలక్ష్మి పథకం లబ్ధిదారులకు ఇటీవల మంజూరు చెక్కులను ఇంటింటికి కౌశిక్‌అన్న కార్యక్రమంలో భాగంగా 43మంది కళ్యాణలక్ష్మి, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను కౌశిక్‌రెడ్డి నేరుగా లబ్ధిదారుల ఇండ్ల వద్దకు వెళ్లి చెక్కులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సరిగొమ్ముల పావని వెంకటేష్, సర్పంచులు జిల్లెల తిరుపతిరెడ్డి, మొగిలి, పుట్ట రాజు, కలాల రాజిరెడ్డి, వెంకటస్వామి ఎంపీటీసీలు ,ఓదెలు, ఎక్కటి సంజీవరెడ్డి, రెవెన్యూ అధికారి రవి తదితరులు పాల్గొన్నారు.

## ఆలయ ప్రాంగణంలో స్వచ్ఛతాహీసేవా



ఇల్లందకుంట మనం న్యూస్: మండల కేంద్రంలోని శ్రీ సీతారామ చంద్రస్వామి దేవాలయ ప్రాంగణంలో ఎంపీడీఓ తీగల శంకర్ ఆధ్వర్యంలో స్వచ్ఛతాహీసేవా కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మహిళలు,పారిశుధ్య కార్మికులు చెత్త చెదారాన్ని తొలగించి బ్లీచింగ్‌పౌడర్ చల్లి శుభ్రం చేశారు. అనంతరం మానవహారంగా ఏర్పడి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచడానికి తమవంతు సహకారాన్ని అందిస్తామని గ్రామస్తులు ప్రతిజ్ఞ చేశారు.

## వినికిడి యంత్రం అందజేత



సుల్తానాబాద్, సెప్టెంబర్ 29 మనం న్యూస్ : లయన్స్ క్లబ్ ఆఫ్ సుల్తానాబాద్ ఆధ్వర్యంలో సుల్తానాబాద్ మండల పరిధిలో నీరుకుల్ల గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన బక్కి శ్రీనివాస్ గత కొన్ని సంవత్సరాలుగా తీవ్ర వినికిడి లోపంతో బాధపడుతూ లయన్స్ క్లబ్ సహాయం కోరగా వెంటనే స్పందించిన లయన్స్ జిల్లా అదనపు కార్యదర్శి వలస నీలయ్య సొంత ఖర్చుతో 5000 రూపాయల విలువగల వినికిడి యంత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు నోముల శ్రీనివాస్‌రెడ్డి,డిస్ట్రిక్ట్ కో- ఆర్డినేటర్ మాటేటి శ్రీనివాస్,దీకొండ భూమేష్ కుమార్,పిట్టల వెంకటేష్,రాయెల్ల నవీన్,తమ్మనవేని సతీష్, పొన్నం చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

## పార్టీలోకి చేరిక

### కండువా కప్పి ఆహ్వానించిన చంద్రుపట్ల సునీల్‌రెడ్డి



మంథని,సెప్టెంబర్ 29 మనం న్యూస్ : మంథని పట్టణంలోని ముత్యాలమ్మ వాడకు చెందిన బిఆర్ఎస్ పార్టీ యువ నాయకులు దాసరి శ్రవణ్ తిరిగి బిజెపి పార్టీలో చంద్రుపట్ల సునీల్ సమక్షంలో శుక్రవారం బిజెపి పార్టీలో చేరారు. ఆయన వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సునీల్‌రెడ్డి మాట్లాడుతూ మంథని నియోజకవర్గంలో అధికార బిఆర్ఎస్ పార్టీకి చెందిన నాయకులు,కాంగ్రెస్ పార్టీ నాయకులు ప్రభుత్వ సంక్షేమ పథకాల పేరుతో ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడమే కాకుండా నియోజకవర్గాన్ని సర్వనాశనం చేశారని అన్నారు. బిజేపి పార్టీ కార్యకర్తలను మభ్యపెట్టి బిఆర్ఎస్ పార్టీలో చేర్చుకుంటున్నారనీ ప్రజలు బిఆర్ఎస్ పార్టీని నమ్మే పరిస్థితిలో లేరని అన్నారు. ఈ కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ మల్కామోహన్‌రావు,జిల్లా అధికార ప్రతినిధి పోతర వేణి క్రాంతి కుమార్,పట్టణ అధ్యక్షులు బూడిద తిరుపతి,మండల అధ్యక్షులు విరబోయిన రాజేందర్,రామగిరి ఇంచార్జ్ ఎడ్ల సదశివ,సీనియర్ నాయకులు కోరబోయిన మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.



## శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : సిపి సుబ్బారాయుడు

కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమీషనర్ ఎల్. సుబ్బరాయుడు ఒక ప్రకటనలో హెచ్చరించారు. నగరంలో 30 పోలీస్ ఆక్ట్ అమలులో ఉన్న నేపథ్యంలో సంబంధిత ఎసిపిల ముందస్తు అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని తెలిపారు. ఎవరైనా నిబంధనలను అతిక్రమిస్తే వారిపై విచారణ జరిపి చట్టరిత్యా తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించిన వారు ఎంతటి వారైనా ఉపేక్షించబోమని ఆయన హెచ్చరించారు.

# మిలాద్ ఉన్ నబీ పండుగ శుభాకాంక్షలు

### ముస్లీంలందరూ అత్యంత పవిత్రంగా భావించే గ్రంథం ఖురాన్

### మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు విజయరమణారావు

పెద్దపల్లి, సెప్టెంబర్ 29(మనం ప్రతినిధి): పెద్దపల్లి జిల్లా కేంద్రంలో మహమ్మద్ ప్రవక్త జన్మదినం అయిన మిలాద్ ఉన్ నబీ పండుగ పర్వదినం సందర్భంగా శుక్రవారం ముస్లీం సోదరులతో కలిసి ర్యాలీలో పాల్గొని ముస్లీం సోదర సోదరిమణులందరికి మాజీ ఎమ్మెల్యే, టీపీసీసీ ఉపాధ్యక్షులు చింతకుంట విజయరమణారావు మిలాద్ ఉన్‌నబీ శుభాకాంక్షలు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇస్లామిక్ క్యాలండర్ ప్రకారం, మూడోనెలలో రబీ-ఉల్ పండుగను జరుపుకుంటారని తెలిపారు. ముస్లీంలు రబీ-ఉల్ అవ్వల్ మాసంలో 12వ రోజున జరుపుకుంటారని తెలిపారు. అరబిక్ భాషలో మిలాద్ లేదా మౌలిద్ అంటే మహమ్మద్ పుట్టినరోజు ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం, అల్లాహ్ ప్రపంచ శాంతి కోరుతూ చివరి ప్రవర్తగా మహమ్మద్





ఎంపికయ్యారని గుర్తుచేశారు. ముస్లీంలందరూ అత్యంత పవిత్ర గ్రంథంగా భావించే ఖురాన్ గ్రంథంలో వీటి గురించి పేర్కొన్నారని తెలిపారు. ప్రవక్త మహమ్మద్‌ను విశ్వశాంతి కోసం అల్లాహ్ నియమించారని, అందుకే తను జన్మించిన రోజున ఆయనను స్మరించుకుంటూ ఈద్-ఎ-మిలాద్-ఉన్-నబీ పండుగను జరుపుకుంటారని తెలిపారు. మిలాద్ ఉన్ నబి పండుగ రోజున ముస్లీంలందరూ మసీదులు, ఇతర ప్రాంతాలలో ప్రార్ధనలు చేస్తారన్నారు. ఖురాన్ పఠనం, మసీదులలో ప్రసంగాలు వంటివి నిర్వహిస్తారని అన్నారు. ఈకార్యక్రమంలో మైనారిటి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్, జిల్లా మిలాద్ కమిటి అధ్యక్షులు ఎంఏ సబీర్, ఎండి రఫ్ ఉల్లాఖాన్, ఎండి అస్లాం, గులాం కాజా, జాహిద్ హుస్సేన్, హఫీజ్ ముజాహిద్, సయ్యద్ అబ్బు, ఎండి జహీర్, ఉద్దీన్, మేరోజ్, అథిక్, ఆరీఫ్, ఇమ్రాన్, గౌస్, కాంగ్రెస్ నాయకులు దొడ్డుపల్లి జగదీష్, దేవరకొండ రాజు, ముస్లీం నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి కోసమే

# చేప పిల్లల పంపిణీ

### ఎంపిపి కొత్త వినీతరెడ్డి

చిగురుమామిడి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)ః మత్స్యకారులు ఆర్థికాభివృద్ధి చెందాలన్న లక్ష్యంతోనే ముఖ్యమంత్రి కెసిఆర్ మత్స్యాకారులకు చేప పిల్లల పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారని ఎంపిపి కొత్త వినీత రెడ్డి అన్నారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల కేంద్రంలో జిల్లా మత్స్య అభివృద్ధి అధికారి విజయ్ కిరణ్‌తో కలిసి మత్స్యకారులకు ఉచిత చేప పిల్లలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ గ్రామాల్లోని చెరువులు, కుంటలపై ఆధారపడిన మత్స్యకారులు అభివృద్ధి చెందాలనే ఉద్దేశంతోనే కేసీఆర్ చేప పిల్లల ఉచిత పంపిణీ కార్యక్రమం చేపట్టారన్నారు. మత్స్య అభివృద్ధి జిల్లా అధికారి విజయ్ కిరణ్ కర్ మాట్లాడుతూ చిగురుమామిడి మండలంలో 12లక్షల చేప పిల్లలు పంపిణీ చేయాల్సి ఉండగా, మొదటి రోజు 6లక్షలు చేప పిల్లల పంపిణీ చేసినట్లు, రెండవ రోజు మరో ఆరు లక్షల చేప పిల్లలను అందిస్తామని చెప్పారు. మత్స్యకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థిక అభివృద్ధి చెందాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాల మత్స్య పారిశ్రామిక సహకార సంఘాల అధ్యక్షులు చెరుకు సంజీవ్,మామిడి సంపత్,గుళ్ల బాలయ్య, రెడ్డి రాజయ్య, జక్కుల బాబు,మత్స్యకారులు కీసర రాజ్ కుమార్, మామిడి రాజు,గూడ సతీష్,పొన్నం వెంకటరాజయ్య, పొన్నం బాలయ్య,మల్లం సదానందం, తదితరులు పాల్గొన్నారు.

# రుణాలు సకాలంలో చెల్లించి సహకార సంఘాభివృద్ధికి కృషి చేయాలి

### సింగిల్ విండో చైర్మన్ వెంకటరమణారెడ్డి



చిగురుమామిడి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)ః రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని సింగిల్ విండో చైర్మన్ జంగా వెంకటరమణారెడ్డి తెలిపారు. శుక్రవారం కరీంనగర్ జిల్లా చిగురుమామిడి మండల సింగిల్విండో ఆధ్వర్యంలో అర్ధ వార్షిక మహాసభ చైర్మన్ వెంకటరమణారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత యాసంగి సీజన్ ల్లో 1,78,522.80క్వింటాళ్ల వరి ధాన్యాన్ని కొనుగోలు చేసినట్లు తెలిపారు. సంఘంలో మొత్తం 459మంది సభ్యులకు గాను 2కోట్ల 88లక్షల 46వేల రూపాయలు రుణమాఫీకి అర్హులై ఉండగా, 330మంది సభ్యులకు కోటి 95లక్షల 39వేయిల రూపాయలు రుణమాఫీ అమలైనట్లు తెలిపారు. ఇంకా 129మంది సభ్యులకు 93లక్షల 7వేల రూపాయలు ఋణమాఫీ రావలసి ఉందన్నారు. సంఘ సభ్యులకు దాదాపుగా 7కోట్ల రూపాయలను క్రాప్ లోన్ తోపాటు 2కోట్ల దీర్ఘ కాలిక రుణాలను,61లక్షల రూపాయల కర్షక మిత్రలోన్ ద్వారా రైతులకు ఇవ్వడం జరిగిందన్నారు.ఎరువుల వ్యాపారం చిగురుమామిడి,ఇందుర్తి,రేకొండ సెంటర్ ల ద్వారా 11,870యూరియ బస్తాలను, 534.15 మెట్రిక్ టన్నుల యూరియాను రైతులకు అందించడం జరిగిందన్నారు.రైతులు తీసుకున్న రుణాలను సకాలంలో చెల్లించి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అభివృద్ధికి కృషి చేయాలని వెంకటరమణ రెడ్డి కోరారు. రైతులు కోళ్ల పరిశ్రమగాని,ఇతర వ్యాపారాలకుగాని రుణాలు తీసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పిలుపునిచ్చారు. ప్రస్తుతం సంఘం లాభాల్లో ఉన్న దృష్ట్యా రైతులందరికీ ఉపయోగ పడే విధంగా గోదాం నిర్మాణానికి స్థల సేకరణకు తీర్మాణం చేసినట్లు తెలిపారు. శాసనసభ్యులు సతీష్ కుమార్ సహకారంతో సంఘాన్ని మరింత అభివృద్ధి చేయడానికి కృషి చేస్తామని తెలిపారు. ఈ సమావేశంలో సంఘ ఉపాధ్యక్షులు కరివేద మహేందర్ రెడ్డి, డైరెక్టర్లు చాడ శ్రీధర్ రెడ్డి, మాచమల్ల లక్ష్మి, అందే స్వామి, పోతరవేని శ్రీనివాస్ యాదవ్, కూతురు రవీందర్ రెడ్డి, తాళ్లపల్లి తిరుపతి, పెరాల లక్ష్మి, రైతు బంధు సమితి జిల్లా కమిటీ సభ్యులు సాంబారి కొమురయ్య, కెడిసిసిబి మేనేజర్ అనిత, సొసైటీ సీఈఓ నర్సయ్య, సంఘ సభ్యులు, రైతులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.



# అభివృద్ధి పనులు ప్రారంభించిన రసమయి

శంకరపట్నం, సెప్టెంబర్ 29 (మనం న్యూస్)ః శంకరపట్నం మండలం అంబాల్ పూర్ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలను స్థానిక ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పలు సంఘ భవనాల పనులను ప్రారంభించడంతో పాటు నూతన భవనాలను ప్రారంభించారు. అనంతరం బాలకిషన్ మాట్లాడుతూ అంబేద్కర్ పేరును కాంగ్రెస్, బిజెపిలు రాజకీయ లబ్ధికోసం వాడుకుంటున్నారన్నారు. అంబేద్కర్ స్ఫూర్తిని తీసుకొని కెసిఆర్ దళిత, బహుజన వర్గాలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెడుతున్నాడని ఆయన అన్నారు. సర్వాయి పాపన్న దళిత బహుజన వర్గాల కోసం ఎంతో పోరాడారని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో సుడా చైర్మన్ జివి.రామకృష్ణారావు, జడ్పిటిసి సభ్యులు లింగంపల్లి శ్రీనివాస్ రెడ్డి, వైస్ ఎంపీపీ పులి కోట రమేష్, మార్కెట్ వైస్ చైర్మన్ చౌడమల వీరస్వామి, ఎస్సీ ఎస్టీ ఫోరం అధ్యక్షులు బోయిన కొమురయ్య, సర్పంచ్ ముంజ వసంత వెంకటేశం, ఎంపీటీసీ గాండ్ల తిరుపతి, సర్పంచ్ల ఫోరం అధ్యక్షులు పల్లె సంజీవరెడ్డి, మండల అధ్యక్షులు గంట మైపాల్,ఉప సర్పంచ్ మట్టి రవి, కో ఆప్షన్ నెంబర్ కాంతల మల్లారెడ్డి, అంబేద్కర్ యువజన సంఘం మెరుగు శ్రీనివాస్, అంతడుపుల సతీష్, ఆడెపు ఓదెలు, సముద్రాల సంపత్, సముద్రాల రాయమల్లు దామెర సతీష్, బొజ్జ చంద్రం, యాట అంజి, సముద్రాల, రమేష్, మొలుగురు మల్లేష్, దామర అశోక్, గాజుల మల్లేష్, సముద్రాల ప్రవీణ్, సముద్రాల సదానందం, సముద్రాల అశోక్, సముద్రాల రాజయ్య కనుకయ్య, రాజ్ కుమార్ నవీన్ సంజీవ్, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

# దివ్యాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ల పంపిణీ



మానకొండూరు, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): మహిళలు, పిల్లలు, వికలాంగులు, వయోవృద్ధుల సంక్షేమ సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో వికలాంగులకు బ్యాటరీ ట్రై సైకిళ్ళ ఉచిత పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే రసమయి బాలకిషన్, సుడా చైర్మన్ రామకృష్ణారావులు హాజరై ట్రై సైకిళ్లను పంపిణీ చేశారు. తెలంగాణ వికలాంగుల కో-ఆపరేటివ్ కార్పొరేషన్ సహకారంతో 30 మంది దివ్యాంగులకు ట్రై సైకిళ్ళతో పాటు ఇద్దరు వికలాంగులకు ఆర్థిక సాయం పథకం ద్వారా 50 వేల రూపాయల చొప్పున చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా రసమయి మాట్లాడుతూ దివ్యాంగుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కట్టుబడి ఉందని, దివ్యాంగులకు 4000 రూపాయల చొప్పున పెన్షన్ ఇస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణ అన్నారు. దివ్యాంగుల ఆర్థిక బలోపేతానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టామని, ఆర్థిక చేయుటకు రుణ సదుపాయాన్ని కల్పిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, లింగంపల్లి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ప్రసవాల పెంపును ఛాలెంజ్‌గా తీసుకోవాలి

### సీజనల్ వ్యాధులు ప్రబలకుండా
### డ్రై డే కార్యక్రమం పకడ్బందీ చేపట్టాలి
### కలెక్టర్ అనురాగ్ జయంతి



సిరిసిల్ల అర్బన్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో సంస్థాగత ప్రసవాల పెంపును ప్రొఫెషనల్ ఛాలెంజ్ గా తీసుకుని డెలివరీ లను పెంచేందుకు కృషి చేయాలని కలెక్టర్ అనురాగ్ జయంతి వైద్యాధికారులకు సూచించారు. శుక్రవారం ప్రభుత్వ ఆసుపత్రులలో సంస్థాగత, సాధారణ ప్రసవాలు , ఆరోగ్య మహిళా కార్యక్రమం, టిబి పరీక్షల పురోగతి పై జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని మెడికల్ ఆఫీసర్ లు, స్టాఫ్ నర్స్‌లతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అందరి సహకారంతో 2018 సంవత్సరంలో ప్రభుత్వ ఆసుపత్రులలో 40 శాతంగా ఉన్న సంస్థాగత ప్రసవాలు ప్రస్తుతం 70 నుంచి 80 శాతం కు పెంచుకున్నామని తెలిపారు. అయినప్పటికీ ఇప్పటికీ కొన్ని పిహెచ్‌సిలలో డెలివరీ లు చేయడం లేదన్నారు. 24 గంటలు పని చేసే ఆసుపత్రులలో ఖచ్చితంగా డెలివరీ ల సంఖ్యను పెంచాలని చెప్పారు. మొదటి కాన్పు, ఆరోగ్యంగా ఉన్న కేసులను స్థానిక



పిహెచ్‌సిల్లోనే చేయాలన్నారు. రిస్క్ ఉన్న కేసులను జిల్లా ఆసుపత్రి, ఏరియా ఆసుపత్రి లకు పంపాలని చెప్పారు. ఆరోగ్య మహిళా కార్యక్రమం లో భాగంగా గుర్తించిన అనుమానిత క్యాన్సర్ కేసుల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. వారిని జిల్లా ఆసుపత్రి కి రిఫరల్ చేస్తూ ఖచ్చితంగా పరీక్షలు చేసుకునేలా మానిటర్ చేయాలన్నారు. అనుమానిత బ్రెస్ట్, ఓరల్ క్యాన్సర్ కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి వారు తప్పనిసరిగా నిర్ధారణ పరీక్షలు చేసుకునేలా చూడాలన్నారు. వర్షాల నేపథ్యంలో డ్రై డే కార్యక్రమం తప్పనిసరిగా క్షేత్ర స్థాయిలో చేపట్టాలన్నారు. జ్వర బాధితులకు టెస్ట్ ల సంఖ్యను పెంచాలన్నారు. డెంగ్యూ , మలేరియా, టైఫాయిడ్ కేసుల ను పూర్తిగా అరికట్టేలా ప్లాన్ చేసుకోవాలన్నారు. హై రిస్క్ ప్రాంతాల పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు డ్రైడేను క్రమం తప్పకుండా నిర్వహించాలన్నారు ప్రధానంగా నీటి నిల్వ లేకుండా జాగ్రత్త పడాలన్నారు. ఇప్పటి వరకూ కిరణం కార్యక్రమం కింద 84 కేసులు రాగా వారిలో 17 మందికి మెడికేషన్, మిగిలిన వారు కౌన్సిలింగ్ చేశారన్నారు. దీనిని రొటీన్ వర్క్ గా కాకుండా ఫిజికల్ హెల్త్ తో సమానంగా మెంటల్ హెల్త్ కు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. టీబీ బాధితులను గుర్తించడం, చికిత్స అందించడం పై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. త్వరలోనే ఎన్నికల షెడ్యూల్ వచ్చి మోడల్ కోడ్ అఫ్ కండక్ట్ వచ్చే అవకాశం ఉన్న దృష్ట్యా వైద్య ఆరోగ్య శాఖ కు సంబంధించి జిల్లాలో మంజూరై ఇప్పటికీ పనులు ప్రారంభించని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ , ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, సబ్ సెంటర్ భవనాలకు వెంటనే టెండర్ , అగ్రిమెంట్ పూర్తి చేసుకుని పనులు గ్రౌండింగ్ అయ్యేలా చూడాలనీ ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. మెడికల్ కళాశాల కు సంబంధించి పెండింగ్ లో ఉన్న మేజర్ సివిల్ వర్కులను మిషన్ మోడ్ లో పూర్తి చేయాలన్నారు. లిఫ్ట్ ను త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. బోధన ,బోధనేతర, విద్యార్థుల సౌకర్యార్థం ఆర్ఓ మినరల్ ప్లాంట్ ను ఏర్పాటు చేయాలన్నారు. తమ పరిధిలో 100 శాతం ప్రసవాలను ప్రభుత్వ ఆసుపత్రుల్లో జరిగేందుకు కృషి చేసిన వీర్నపల్లి సబ్ సెంటర్ ఎఎన్ఎం ఎస్.కీర్తి, లక్ష్మీపూర్ సబ్ సెంటర్ ఎఎన్ఎం మాధవి, గంభీరావుపేట -1 సబ్ సెంటర్ కె.ప్రమీలను కలెక్టర్ అనురాగ్ జయంతి ప్రశంసాపత్రం బహుకరించి అభినందించారు. వారి పనితీరు మిగతా ఎఎన్ఎంలకు ఆదర్శంగా, స్ఫూర్తిగా నిలుస్తుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ లు ఎన్ ఖీమ్యా నాయక్, గౌతమ్ రెడ్డి, మెడికల్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ చంద్ర శేఖర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుమన్ మోహన్ రావు, జిల్లా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మురళీ ధర్ రావు, జిల్లా ఉపవైద్యాధికారులు డాక్టర్ శ్రీరాములు, డాక్టర్ రజిత ,వేములవాడ ఏరియా ఆసుపత్రి పర్యవేక్షకులు డాక్టర్ మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## కలకత్తా నిరసన ప్రదర్శనలో సింగరేణి మాజీ ఉద్యోగులు పాల్గొనాలి

మంచిర్యాల, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): కోల్ ఇండియా లిమిటెడ్, సింగరేణి సంస్థలో పనిచేసి రిటైర్డ్ అయిన ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఈనెల 30న కోల్ కలకత్తాలో జరిగే నిరసన ప్రదర్శనలో సింగరేణి మాజీ ఉద్యోగులు కూడా పాల్గొనాలని సింగరేణి రిటైర్డ్ ఎంప్లాయిస్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు దండంరాజు రాంచందర్ రావు పిలుపునిచ్చారు. అఖిల భారత కోల్ పెన్షన్ అసోసియేషన్ కన్వీనర్ పికె.సింగ్ రాథోర్ ఈ పిలుపును ఇచ్చారన్నారు. కోల్ ఇండియా, సింగరేణి పెన్షనర్లకు కరవు భత్యంతో పెన్షన్ పెంచాలని, సిపిఆర్ ఎంఎస్ కార్డు ద్వారా దేశవ్యాప్తంగా సులభంగా వైద్య సౌకర్యాన్ని కలిపించాలన్న డిమాండ్‌లు ఉన్నాయన్నారు. మన సమస్యలు సిఎంపిఎఫ్ సంస్థకు, బొగ్గు మంత్రిత్వ శాఖ కేంద్ర ప్రభుత్వానికి వినిపించడం, మన బలాన్ని ప్రదర్శించాలని కోరారు. ఈ నిరసన న్యాయ సమ్మతమైందని, చట్టబద్ధమైన ఆశయంతో కూడుకుందన్నారు. విజయవంతంగా సమస్యలు సాధించడానికి, ఈ నిరసన వేదిక బలాన్నిస్తుందన్నారు. రిటైర్డ్ అయిన ఉద్యోగుల డిమాండ్లను బేషరతుగా ఆమోదించి, ఉద్యోగులకు సముచితమైన అవసరాలకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం తగిన పరిష్కారాన్ని రూపొందించాలని ఆయన కోరారు.

## ఇంటెలిజెన్స్, పోలీస్ వ్యవస్థ నిద్రపోతోందా..?

**- ఎంపి నివాసం, కార్యాలయానికే**
**రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితేంటి..?**
**- తక్షణమే ఎంఐఎం గూండాలపై చర్యలు తీసుకోవాల్సిందే**
**: బిజెపి కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ కన్వీనర్ ప్రవీణ్‌రావు**



కరీంనగర్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): ''ప్రజా సమస్యలపై నిరసన తెలపాలనుకునే ప్రతిపక్ష పార్టీలను ఒక రోజు ముందుగానే అదుపులోకి తీసుకుని గృహ నిర్బంధం చేసే పోలీసులు మజ్లిస్ గూండాలు నడి రోడ్లపైకి వచ్చి విచ్చలవిడిగా నినాదాలు చేస్తూ మత కల్లోలాలు సృష్టించే కుట్ర చేస్తుంటే ఏం చేస్తున్నారు..? ''అసలు ఇంటెలిజెన్స్ వ్యవస్థ ఎటు పోయింది? నిద్రపోతుందా? స్వాక్షాత్తు పార్లమెంట్ సభ్యుడి నివాసం, ఆఫీస్ వద్ద ఎంఐఎం గూండాలు విచ్చల విడిగా దేశ ద్రోహ నినాదాలు చేస్తే పట్టించుకోరా?'' అని బిజెపి కరీంనగర్ పార్లమెంట్ కన్వీనర్ బోయినిపల్లి ప్రవీణ్ రావు ప్రశ్నించారు. కరీంనగర్‌లో ఇంటెలిజెన్స్, పోలీసు వ్యవస్థ నిద్రాణ వ్యవస్థలో ఉన్న కారణంగానే ఈ ఘటన చోటుచేసుకుందన్నారు. శుక్రవారం సాయంత్రం ఎంపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో పార్టీ జిల్లా మాజీ అధ్యక్షులు బాస సత్యనారాయణ, డాక్టర్ పుల్లల పవన్ కుమార్ తదితరులతో కలిసి ప్రవీణ్‌రావు మాట్లాడుతూ పోలీసుల తీరును తీవ్రంగా తప్పుపట్టారు. స్వాక్షాత్తు పార్లమెంట్ సభ్యుడి నివాసం, ఆఫీస్ వద్ద ఎంఐఎం గూండాలు విచ్చల విడిగా దేశ ద్రోహ నినాదాలు చేసిన ఎంఐఎం గూండాలపై చర్యలు తీసుకోవాల్సిన పోలీసులు.. ఇదేంటని ప్రశ్నించిన బిజెపి కార్యకర్తలను బెదిరిస్తున్నారని మండిపడ్డారు. తక్షణమే వాళ్లపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలుంటాయని హెచ్చరించారు. బాస సత్యనారాయణ మాట్లాడుతూ''ప్రశాంతంగా ఉన్న కరీంనగర్ లో కావాలని అలజడి రేపి మత కల్లోలాలు సృష్టించి రాబోయే ఎన్నికల్లో లబ్ది పొందాలని ఎంఐఎం గూండాలు బైక్ ర్యాలీలు దేశద్రోహ నినాదాలు చేశారన్నారు. బిజెపిని ప్రజలు ఆదరిస్తున్నారనే భయంతో వణికిపోతున్న అధికార పార్టీ నేతలు మజ్లిస్ గూండాలతో కలిసి ప్రశాంతంగా ఉన్న కరీంనగర్ ను రావణ కాష్టంలా మార్చేందుకు కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. ఎంపీ నివాసానికి, కార్యాలయానికే రక్షణ లేకపోతే ఇక సామాన్యుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు. ఇదే పరిస్థితి కొనసాగితే హిందూ సమాజాన్ని రక్షించేందుకు ఎంతదాకైనా తెగించి కొట్లాడేందుకు సిద్ధంగా ఉన్నామని, 24 గంటల్లో చర్యలు తీసుకోకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమిస్తామని హెచ్చరించారు.

# బిఆర్ఎస్‌కు తనుగుల ఎంపిటిసి సభ్యురాలి రాజీనామా

**- ఎమ్మెల్సీ కౌషిక్ రెడ్డి నన్ను అవమానపరిచారు**

**- ఆత్మగౌరవాన్ని చంపుకోలేక బిఆర్ఎస్‌ను వీడుతున్నా**

**-వచ్చే నెల 4న మూడు వేల మందితో బిఎస్పీలో చేరుతున్నా**

**: ఎంపిటిసి సభ్యురాలు వాసాల నిరోష**

జమ్మికుంట రూరల్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): బిఆర్ఎస్ పార్టీలో సరైన గుర్తింపులేని కారణంగా ఆ పార్టీకి రాజీనామా చేస్తున్నట్లు తనుగుల గ్రామ ఎంపిటిసి సభ్యురాలు వాసాల నిరోషా రామస్వామి ప్రకటించారు. శుక్రవారం జమ్మికుంటలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి ఇంటికి పిలుచుకొని తమ ఆత్మ గౌరవాన్ని దెబ్బతీసే విధంగా అవమాన పరిచారని, దాంతో మనస్సు కలత చెంది బిఆర్ఎస్‌కు రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. 20 సంవత్సరాలుగా బిఆర్ఎస్ పార్టీతో తనకున్న అనుబంధం తెగిపోతున్నందుకు బాధగా ఉన్నప్పటికీ, తమ అనుచరులతో కలిసి రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు. అక్టోబర్ 4న 3వేల మంది అనుచరులతో ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ సమక్షంలో బీఎస్పీ పార్టీలో చేరుతున్నట్లు తెలిపారు 2004లో తనకు ఓటు హక్కు వచ్చిన నాటి నుండి నేటి వరకు టిఆర్ఎస్ పార్టీకి క్రియాశీలకంగా వ్యవహరిస్తూ, గ్రామ మండల స్థాయిలో పార్టీ గెలుపు కోసం అహర్నిశలు కృషి చేశామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈటెల రాజేందర్ తమకు పార్టీ బీఫామ్ ఇవ్వకుండా అవమానపరిచారన్నారు. అయినా తమకున్న గుర్తింపుతో తాము చేసిన సేవలను ప్రజలు గుర్తించి 2019 ఎంపీటీసీ ఎన్నికల్లో ఇండిపెండెంట్ అభ్యర్థిగా ఆశీర్వదించి గొప్ప మెజారిటీతో గెలిపించారన్నారు. ఉప ఎన్నికల సమయంలో ఈటెలతో పోయి బిజెపిలో కలిసి అంగీలు చింపుకొని ఈటల చెప్పులు మోసిన వాళ్లకు నామినేటెడ్ పదవులు పైసలు, ప్యాకేజీలు ఇచ్చారని, నెత్తిమీద రూపాయి పెడితే పావలకు అమ్ముడు పోని వాళ్లని పార్టీలోకి తీసుకున్నారని పార్టీని నమ్ముకుని పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారిని విస్మరించారని ఆమె ఆరోపించారు. తమ రాజకీయ గురువైన పరిపాటి రవీందర్ రెడ్డికి అన్ని అర్హతలున్నప్పటికీ బోయినపల్లి వినోద్ కుమార్ ఆయనకు ఎలాంటి కార్పొరేషన్ పదవి ఇప్పించలేదన్నారు. సామాజిక తెలంగాణ బీఎస్పీ పార్టీతోనే సాధ్యమన్న విశ్వాసంతో బిఎస్పీలో చేరుతున్నట్లు తెలిపారు. అక్టోబర్ 4 న నిర్వహించే బహిరంగ సభను విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వాయి పాపన్న కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి, ధర్మారం మాజీ సర్పంచ్ పైడిపల్లి అంజయ్య గౌడ్, బిఆర్ఎస్ నాయకులు ఓల్లాల సాంబయ్య గౌడ్, మ్యాకమల్ల వెంకటేష్, రాచపల్లి సాగర్, పుల్యాల నరేష్, కొంగల కుమార్ యాదవ్, పోలు బిక్షపతి, జూపాక కృష్ణ, పంజాల దిలీప్ గౌడ్, మారపల్లి అజయ్ లతో పాటు 60 మంది అనుచరులు పాల్గొన్నారు.



# మారుమూల ప్రాంతాలకు రవాణా సౌకర్యం కల్పించిన ఘనత కెసిఆర్‌దే

## మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి

సిర్పూర్ టి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): రాష్ట్రంలోని మారుమూల గ్రామాల్లో మెరుగైన రవాణా సౌకర్యం క ల్పించిన ఘనత కెసిఆర్‌దేనని రాష్ట్ర అటవీ, న్యాయశాఖ మంత్రి అల్లోల ఇంద్రకరణ్ రెడ్డి అన్నారు. సిఎం కేసీఆర్ సారధ్యంలో రాష్ట్రం నలుమూలల ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యాన్ని కల్పించినట్లు తెలిపారు. శుక్రవారం ఉమ్మడి ఆదిలాబాద్ ఎమ్మెల్సీ దండే విటల్, సిర్పూర్ ఎమ్మెల్యే కోనేరు కోనప్పతో కలిసి సిర్పూర్ మండలంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మండలంలోని అచ్చెల్లి-చింతకుంట ప్రధాన రహదారిలో ఐదు కోట్ల 30 లక్షల నిధులతో పూర్తయిన బ్రిడ్జిని ప్రారంభించారు. అనంతరం సిర్పూర్ టి లోని శివపూర్ కాలనీ వరకు సుమారు రెండు కోట్ల నిధులతో మంజూరైన బీటి రోడ్డు నిర్మాణ పనులను భూమి పూజ చేసి ప్రారంభించారు. మండల కేంద్రంలోని పాతట్ల కూడలి వద్ద సుమారు మూడు కోట్ల నిధులతో నిర్మించిన బ్రిడ్జిని ప్రారంభించారు. అక్కడినుండి సిర్పూర్ పట్టణం కు చేరుకొని ఎస్టీ కాలనీలో రూపాయలు 10 లక్షల నిధులతో నిర్మించనున్న ఆదివాసి భవన్ కు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో టిఆర్ఎస్ ప్రభుత్వం అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తుందన్నారు. రాష్ట్రంలోని ప్రతి ఇంటికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతున్నాయన్నారు. వచ్చే ఎన్నికల్లో మరోసారి బిఆర్ఎస్ ప్రభుత్వాన్ని గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా పెద్ద బండ గ్రామం వద్ద 500 ద్విచక్ర వాహనాలతో బిఆర్ఎస్ నాయకులు మంత్రి కాన్వాయ్ ముందు భారీ ర్యాలీ నిర్వహించారు. పెద్ద బండ గ్రామం నుండి అచ్చల్లి, చింతకుంట, హిరపుర్, సిర్పూర్ వరకు బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ బోర్కడే హనుమంత్ సహదేవరావు, జెడ్పి వైస్ చైర్మన్ కోనేరు కృష్ణారావు, కాగజ్ నగర్ మున్సిపల్ చైర్మన్ సద్దాం హుస్సేన్, ఎంపిపి చునార్కర్ సువర్ణ, వైస్ ఎంపిపి సత్యనారాయణ, మండల కో-ఆప్షన్ సభ్యుడు కీజర్ హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.



# పరిసరాల పరిశుభ్రతతోనే మనుగడ సాధ్యం

**డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ జై కిషన్ ఓజా**




లక్షెట్టిపేట్, సెప్టెంబర్ 29(మనం న్యూస్ ): పరిసరాల పరిశుభ్రతతోనే మానవ మనుగడ సాధ్యమని ప్రభుత్వ ఆదర్శ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ జై కిషన్ ఓజా అన్నారు. శుక్రవారం ఇండియన్ స్వచ్ఛత లీగ్ 2.0 ను పురస్కరించుకొని కళాశాల ఆవరణలో విద్యార్థులతో కలిసి పరిసరాలను శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి శుక్రవారం కళాశాలలో స్వచ్ఛత హీ సేవా కార్యక్రమాన్ని చేపడుతున్నామన్నారు. పరిశుభ్రమైన పరిసరాలు ఉంటేనే అందరూ ఆరోగ్యంగా ఉంటారని, ప్రకృతి సమతుల్యం ఏర్పడుతుందన్నారు. విద్యార్థులలో చదువుతో పాటుపరిసరాల పరిశుభ్రత, సామాజిక సేవ పట్ల అవగాహన కల్పించాడానికే కళాశాల సిబ్బందితో పాటు తాను కూడా స్వయంగా పరిసరాల పరిశుభ్రతలో పాలుపంచుకుంటున్నట్లు తెలిపారు. పరిసరాల పరిశుభ్రతలో ప్రతి ఒక్కరూ భాగస్వాములవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగధిపతి కుమారస్వామి, చరిత్ర విభాగధిపతి శ్రీనివాస్, మున్సిపల్ ఇఇ కట్ల రాకేష్, సిబ్బంది, వినోద్, సందీప్, ప్రశాంత్,నరేష్, తిరుపతి, సంతోష్, మానస,సువర్ణ, సునీత, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

మనం
నిజామాబాద్
కామారెడ్డి

# ప్రతి ఓటరు తప్పక ఓటింగ్‌లో పాల్గొనాలి

## కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు




నిజామాబాద్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): ఓటు హక్కు కలిగి ఉన్న ప్రతి ఓటరు తప్పక ఓటింగ్‌లో పాల్గొనాలని కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు పిలుపునిచ్చారు. రానున్న ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని పోలింగ్ పై ప్రజలకు అవగాహన కల్పించేందుకు జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో ప్రత్యేకంగా గేయాన్ని రూపొందించారు. జిల్లా సాంస్కృతిక సమన్వయకర్త అష్ట గంగాధర్ స్వరపరిచిన ఈ గేయాన్ని శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, రేంజ్ ఐజి ఎస్.చంద్రశేఖర్ రెడ్డి, పోలీస్ కమిషనర్ వి.సత్యనారాయణ లాంఛనంగా ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో కీలకమైన ఓటింగ్ ప్రక్రియలో అర్హులైన ప్రతి ఒక్కరూ తప్పనిసరి భాగస్వాములు కావాలని సూచించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక గేయం ప్రదర్శనతో పాటు వివిధ కార్యక్రమాల ద్వారా పోలింగ్ పై ప్రజలను చైతన్యపరుస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, నగర పాలక సంస్థ కమిషనర్ ఎం.మకరంద్, జిల్లా ఎన్నికల నోడల్ అధికారి సింహాచలం, అదనపు డీసీపీ లు జయరాం, గిరిరాజ్, ఏసీపీ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

# బిఆర్ఎస్‌లో చేరికలు



ఆర్మూర్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): తల్వేద, ఉమ్మెడ గ్రామాలకు చెందిన బిజెపి కార్యకర్తలు శుక్రవారం ఎమ్మెల్యే జీవన్ రెడ్డి ఆధ్వర్యంలో బిఆర్ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం జీవన్‌రెడ్డి మాట్లాడుతూ బిఆర్ఎస్ ప్రభుత్వం, ముఖ్యమంత్రి కేసీఆర్ అభివృద్ధి చేస్తున్న సంక్షేమ పథకాలకు ఆకర్షితులై బిఆర్ఎస్‌లో చేరుతున్నట్లు తెలిపారు. పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని తెలిపారు.

## అనాథ మృతదేహానికి అంత్యక్రియలు

### 80 మంది అనాథ పార్థివదేహాలకు అంత్యక్రియలు చేసిన సాయితేజ



నిజామాబాద్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షులు డాక్టర్ మద్దుకూరి సాయిబాబు శుక్రవారం అనాథ వ్యక్తి మృతదేహానికి శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. గత వారం రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందగా, మృతుని ఆచూకీ కోసం స్థానిక వన్ టౌన్ పోలీసులు ప్రయత్నించారు. మృతునికి చెందిన బంధువులు ఎవరూ రాకపోవడంతో ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థకు సమాచారం అందించారు. దీనికి స్పందించిన సాయితేజ నగరంలోని దుబ్బ రోడ్డులోని సార్వజనిక్ స్మశాన వాటికలో శుక్రవారం మృతునికి సంప్రదాయ పద్ధతిలో అంత్యక్రియలు నిర్వహించారు. ఆయన ఇప్పటి వరకు 80 మంది అనాథల మృతదేహాలకు అంత్యక్రియలు జరిపించి ఉదారతను చాటుకోవడం గమనార్హం. ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ పోలిస్ సిబ్బంది అమీద్, ఇందూరు యువత స్వచ్ఛంద సేవా సంస్థ గౌరవ అధ్యక్షులు దారం గంగాధర్, కార్యవర్గ సభ్యులు కాసుల సాయితేజ, చందా జగన్మోహన్, మద్ది గంగాధర్ , కిరణ్.సతీష్ తదితరులు పాల్గొన్నారు.



## సమస్యల పరిష్కారం కోరుతూ తహసీల్దార్‌కు ఆశ వర్కర్ల వినతి పత్రం

మెట్‌పల్లి, సెప్టెంబర్ 29 ( మనం న్యూస్): సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పట్టణంలోని అంబేద్కర్ పార్క్ ముందు సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు చేపట్టిన సమ్మె శుక్రవారంతో ఐదో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా తమ సమస్యల పరిష్కారం గురించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లాలని కోరుతూ ఆశా కార్యకర్తలు స్థానిక తహసీల్దార్ వినతి పత్రం పత్రం అందించారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి కుంచె శంకర్,కోరుట్ల నియోజకవర్గం కార్యదర్శి పోశన్న, కోరుట్ల పట్టణ కార్యదర్శి నాగరాజు, ఆశవర్కర్ల అధ్యక్షురాలు సిహెచ్ నీరజ, ఉపాధ్యక్షురాలు తిరుమల, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

## బిఆర్ఎస్ నేతల దాడి హేయమైన చర్య

### బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ



బెల్లంపల్లి, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): బిఆర్ఎస్ నాయకుల చేస్తోన్న దాడులు హేయమైనవని, వారికి రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని బిజెవైఎం జిల్లా అధ్యక్షుడు పట్టి వెంకటకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు చేస్తున్న మోసాలను, అక్రమాలను నిలదీస్తున్నందున మండల బిజెపి అధ్యక్షులు గజ్జెల్లి రాజ్ కుమార్‌పై బిఆర్ఎస్ నాయకులు కొమ్మెర లక్ష్మణ్ సర్పంచ్ అశోక్ గౌడ్ తమ అనుచరులతో దాడికి పాల్పడ్డారన్నారు. శుక్రవారం వెంకటకృష్ణ మీడియాతో మాట్లాడుతూ రాజ్‌కుమార్‌తో పాటు అతడి తల్లిపై కూడా దాడి జరపడం బిఆర్ఎస్ గూండా గిరికి అద్దం పడుతోందన్నారు. బిఆర్ఎస్ గుండాలకు రాబోయే రోజుల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు. బిఆర్ఎస్ నాయకుల అరాచకాలపై తాల్లగురిజాల టౌన్ ఎస్ఐ నరేష్ , సీఐ రాజ్ కుమార్‌కు పిర్యాదు చేశామని తెలిపారు.

# బిఆర్ఎస్‌లో చేరికలు



నిజామాబాద్ రూరల్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): నిజామాబాద్ రూరల్ మండలం సారంగాపూర్ గ్రామానికి చెందిన 30 మంది కాంగ్రెస్, బిజెపి నాయకులు, కార్యకర్తలు శుక్రవారం జెడ్పీటీసీ సభ్యులు బాజిరెడ్డి జగన్మోహన్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా జగన్మోహన్ గులాబీ కండువాలు కప్పి వారిని పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం సారంగాపూర్ గ్రామ యువకులు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం అభివృద్ధి, సంక్షేమంలో అద్భుతమైన ప్రగతి సాధిస్తోందని, కెసిఆర్ ఆదర్శవంతమైన పాలన అందిస్తున్నారన్నారు. కేసీఆర్ ప్రభుత్వ ప్రగతిశీల ఆలోచనా విధానానికి తామంతా ఆకర్షితులమై బిఆర్ఎస్‌లో చేరినట్లు తెలిపారు. బాజిరెడ్డి జగన్మోహన్ మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి సముచిత గౌరవం ఉంటుందన్నారు. సీఎం కేసీఆర్ దార్శనిక పాలనతో ప్రతి పల్లెకూ అభివృద్ధి ఫలాలు, ప్రతి ఇంటికీ సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు.

## బిఆర్ఎస్ ప్రభుత్వ సంక్షేమాన్ని చూసి పార్టీలో చేరికలు

### ఎమ్మెల్యే గణేష్ గుప్తా



నిజామాబాద్ అర్బన్, సెప్టెంబర్ 29 (మనం న్యూస్): కెసిఆర్ ప్రభుత్వం అమలు చేస్తోన్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి బిఆర్ఎస్‌లో భారీ చేరికలు కొనసాగుతున్నాయని నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తా అన్నారు. నిజామాబాద్ నగరంలోని నాగారానికి చెందిన 200 మంది యువకులు శుక్రవారం బిఆర్ఎస్ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం గణేష్ గుప్తా మాట్లాడుతూ యువత చేరికలతో బిఆర్ఎస్ పార్టీకి మరింత బలం చేకూరిందన్నారు. కార్యకర్తలే బిఆర్ఎస్ పార్టీకి శ్రీరామ రక్ష అని, ప్రతి కార్యకర్తని కంటికి రెప్పలా కాపాడుకుంటామని ఆయన భరోసా ఇచ్చారు. నిత్యం ప్రజల్లో ఉంటూ ముఖ్యమంత్రి కెసిఆర్ అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ నాయకులు దండు శేఖర్, సుజిత్ సింగ్ ఠాకూర్, సత్య ప్రకాశ్, ముజాహిద్ ఖాన్, ఖలీమ్, సలీం, దామఖాన్ తదితరులు పాల్గొన్నారు.